క్లుప్తంగా

కరవది కార్యదర్శి బదిలీ

ఒంగోలు రూరల్: కరవదిలో గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న పూర్ణచంద్రరావు గ్రేడ్-1 కార్యదర్శిగా ప్రమోషన్‌పై గుంటూరు బదిలీ అయ్యారు. సంవత్సరం క్రితం కొత్తపట్నం నుంచి కరవదికి ఆయన వచ్చారు. ఏడాదికిపైగా కరవదిలో సేవలందించారు.

రెవెన్యూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

● జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

పుల్లలచెరువు: గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్వోలు అప్రమత్తంగా ఉంటూ రెవెన్యూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. జేసీ మాట్లాడుతూ గ్రామాల్లో రీ సర్వే సక్రమంగా చేయాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోతే సమస్యలు వస్తాయని, విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. కవలకుంట్ల వీఆర్వో వాసు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ముటుకుల వీఆర్వో కృష్ణకు షోకాజ్ నోటీసు ఇస్తున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఈయన వెంట మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, తహసీల్దార్ దాసు పాల్గొన్నారు.

కుక్కలు పట్టివేత

దొనకొండ: మండలంలోని పడమటి లక్ష్మీపురంలో విచ్చలవిడిగా కుక్కలు సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి వరికూటి నాగార్జున శుక్రవారం రెండు రోజుల నుంచి కుక్కలు పట్టే కార్యక్రమం చేపట్టారు. సుమారు 200 కుక్కలు పట్టుకుని ఆటో ట్రాలీలో అడవిలో వదిలేశారు. వెంటనే స్పందించిన పంచాయతీ సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

తాళ్లూరు: మండలంలోని గుంటి గంగ సమీపంలో శుక్రవారం పేకాట స్థావరంపై ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ తన సిబ్బందితో ఆకస్మికంగా దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుండి రూ.1,07,780 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పేకాట స్థావరం వద్ద 11 బైక్‌లను సీజ్ చేశారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

మార్కాపురం టౌన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో కోడిరామమూర్తి క్రీడ, నటశిక్షణ సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న 125 మంది విద్యార్థులకు శుక్రవారం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కరిముల్లా, 11వ వార్డు ఇన్చార్జ్ ఉత్తమ్ కుమార్ అల్పాహారం అందజేశారు. చిన్నారుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్న సేవా సంఘానికి తమ వంతు బాధ్యతగా అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాద్యం వేణు, కాళంగి శ్రీనివాసులు, మహేష్, గంగిశెట్టి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీపై కిసాన్ డ్రోన్‌లు

త్రిపురాంతకం: రైతు మిత్ర గ్రూపులకు కిసాన్ డ్రోన్‌లను 50 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు వ్యవసాయాధికారి కె.నీరజ తెలిపారు. మండలంలోని సోమేపల్లిలో క్షేత్ర స్థాయిలో కిసాన్ డ్రోన్‌లతో మందు పిచికారీ చేసే విధానంపై ప్రదర్శన నిర్వహించారు. ఆసక్తి ఉన్న వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు నీరజ తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ఠ మాసం, మాఘ నక్షత్రం, అష్టమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు.

ఎమ్మెల్యే బాలినేని ప్రత్యేక పూజలు

టంగుటూరు: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ఈఓ రమేష్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసులు, అర్చకులు బాలినేనికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అలాగే ఒంగోలుకు చెందిన నేత పటాపంజుల అశోక్‌కుమార్ అమ్మవారి మొక్కులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, నాయకులు సూదనగుంట నారాయణరావు, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణ, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, ఒంగోలు డిప్యూటీ మేయర్ వేమూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి

ఒంగోలు టౌన్: వైద్య పరంగా అత్యవసర పరిస్థితి అనేది మనకు చెప్పిరాదని, అందువలన ప్రతిఒక్కరూ ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండటం మంచిదని జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా జైలులో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది, ఖైదీలకు రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రథమ చికిత్సపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణారెడ్డి మాట్లాడుతూ ఏదైనా అత్యవసర పరిస్థితి సంభవించినప్పుడు ప్రాణాలు కాపాడేందుకు ప్రథమ చికిత్స దోహదపడుతుందన్నారు. జైలు మెడికల్ ఆఫీసర్ కేఎస్‌వీఎస్ ధర్మతేజ ఆధ్వర్యంలో జైలు సిబ్బంది, ఖైదీలకు ప్రథమ చికిత్సలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కాలిన గాయాలు, ప్రమాదాల్లో కాలు, చేయి విరగడం, పాము కాటు, వడదెబ్బ, తదితర ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ప్రథమ చికిత్స చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఆరోగ్యంగా జీవించేందుకు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.కృష్ణ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో జైలర్ జి.ఎరికి నాయుడు, డిప్యూటీ జైలర్ కె.యలమందయ్య తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

5, 6 తేదీల్లో బండ పందెం

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లెలో భూలక్ష్మీ సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా జూన్ 5, 6వ తేదీల్లో రాష్ట్ర స్థాయి బండ పందెం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 5న రెండు పండ్ల విభాగంలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండో, మూడో, నాల్గోవ బహుమతులు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు అందజేస్తారు. 6వ తేదీన న్యూ కేటగిరీ విభాగంలో బండ పందెం జరుగుతుందన్నారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండో, మూడో, నాల్గో, ఐదో బహుమతులు వరుసగా రూ.50 వేలు, 30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, 5 వేలను దాతలు అందజేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9849490257, 9133262194, 9959815290 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

అటవీ అధికారుల ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, ఫారెస్ట్ అధికారులు

కంభం: అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మేరీ లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణహిత జీవనశైలిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ రవి మాట్లాడుతూ పర్యావరణానికి ప్లాస్టిక్‌తో ముప్పు పొంచి ఉందని, ప్రజలు వాటి వాడకాన్ని పూర్తిగా తగ్గించుకోవాలన్నారు. పర్యావరణహిత జీవనశైలిపై రెవెన్యూ సిబ్బందికి ఫారెస్టు అధికారులు అవగాహన కల్పించారు. సెక్షన్ ఆఫీసర్ ప్రభాకరరావు, బీట్ అధికారి సయ్యద్ ఇమ్రాన్, ఆర్ఐ శ్రీను, రెవెన్యూ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులంతా ఇళ్లు నిర్మించుకోవాలి

ఈతముక్కల (కొత్తపట్నం): ఇళ్ల స్థల పట్టాలు పొందిన లబ్ధిదారులంతా ఇళ్లు నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి అర్చన సూచించారు. మండలంలోని ఈతముక్కల గ్రామ పంచాయతీ పరిధిలో జగనన్న లే అవుట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం సచివాలయంలో అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈతముక్కల గ్రామంలోని వారికి 142 ఇళ్ల పట్టాలు మంజూరవగా, మంచినీటి పైపులు వేశామని, బోరు, వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం కూడా జరిగిందని అన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టుకోవాలని సూచించారు. హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ఇసుక, సిమెంట్, స్టీల్ సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం రూ.1.80 లక్షల నగదు మంజూరు చేస్తోందన్నారు. డ్వాక్రా గ్రూపుల నుంచి రూ.35 వేలు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 90 పనిదినాలు, బ్యాంక్‌ల నుంచి కూడా రుణాలు మంజూరు చేస్తారని చెప్పారు. ఇవన్నీ ఉపయోగించుకుంటే గృహం పూర్తి చేసుకోవచ్చని వివరించారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యుల ఇంటి నిర్మాణానికి సీసీఎల్, స్త్రీ నిధి, ఉన్నతి, సీఐఎఫ్ ద్వారా రూ.50 వేలు అందిస్తారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద లక్ష రూపాయలు కూడా అందిస్తారన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అన్నం నాంచార్లరెడ్డి, ఏపీఎం షేక్ రజియా సుల్తాన్‌బేగం, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అర్చన

మద్యం షాపులో చోరీ

వేటపాలెం: గ్రామ శివారులో ఉన్న మద్యం షాపులో దొంగలు పడి నగదు చోరీకి పాల్పడ్డారు. ఈఘటన పందిళ్లపల్లి శివారులో గురువారం అర్ధరాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. మద్యం షాపుపైన రేకులు పగులగొట్టి దొంగలు లోనికి ప్రవేశించారు. షాపులో ఉన్న ఇనుప నగదు బాక్సులో రూ. 2.57 లక్షలు నగదు దోచుకెళ్లారు. ఈ మేరకు షాపు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్సై జీ సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నుంచి క్లూస్ టీంని రప్పించి వేలిముద్రలు సేకరించారు. అయితే మద్యం షాపునకు ఇద్దరు వాచ్‌మెన్లు ఉన్న ప్పటికీ షాపులో చోరీ జరగడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని వాచ్‌మెన్‌లను విచారిస్తున్నారు.



నగదు బాక్స్‌ను పరిశీలిస్తున్న ఎస్సై సురేష్

పాల కేంద్రాలను బలోపేతం చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ బాబూరావు

● డీఆర్‌డీఏ పీడీ బాబూరావు

ముండ్లమూరు: జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా మహిళల భాగస్వామ్యంతో నడుస్తున్న పాల కేంద్రాలను బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ-వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబూరావు సూచించారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువ పథకంపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు 50 రాయితీపై ఇతర రాష్ట్రాల నుంచి గేదెల కొనుగోలుకు అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో పాల కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కలిప్పించినట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అమూల్ పాల కేంద్రాల ద్వారా ధరలు పెంచడంతో ప్రతి రైతుకు లాభం చేకూరిందన్నారు. పాడి పరిశ్రమపై ఆశక్తి ఉన్న వారికి పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రైవేట్ డెయిరీల కంటే అధిక ధరలు కల్పించామన్నారు. అవసరమైన ప్రతి మహిళకు బ్యాంకు, స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి పథకం ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమూల్ పాల కేంద్రాలను సిబ్బంది, గ్రామ సంఘ సహాయకులు రోజూ ఉదయం, సాయంత్రం విజిట్ చేసి పాలు పోసే వారికి ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సిబ్బంది పర్యవేక్షణ లేకుండా అకారణంగా పాల కేంద్రాలను మూతేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే వివిధ కారణాలతో మూతపడిన పాల కేంద్రాలను మళ్లీ ప్రారంభించాలన్నారు. మండలంలోని తూర్పుకంభంపాడు పాల కేంద్రానికి గతేడాది రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు రావడాన్ని గుర్తు చేశారు. చింతలపూడి, వేములబండ, పసుపుగల్లు, పులిపాడు, శంకరాపురం, పోలవరం, వేంపాడు, భీమవరం, కొమ్మువరం, ఉమామహేశ్వరపురం గ్రామాల్లో నిత్యం పర్యటించి పాల కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలన్నారు. సమావేశంలో ఏపీఎం హనుమంతరావు, సీసీలు గురవయ్య, డేవిడ్, అకౌంటెంట్ మార్తమ్మ ఉన్నారు.

పేదల కల నెరవేర్చిన జగనన్న



జగనన్న కాలనీలో గృహప్రవేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లు లేని పేదల కలను నెరవేర్చారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. శుక్రవారం చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని కేవీ పాలెం లే అవుట్‌లో జగనన్న కాలనీలో పల్లెల కొండలు నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశంలో బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని పూజలు చేశారు. ప్రభుత్వం అందించిన డబ్బుతో ఇంటిని సుందరంగా నిర్మించుకున్న కొండలును ఆమె అభినందించారు. చీమకుర్తి పట్టణంతో పాటు రాష్ట్రంలోని దాదాపు 30 లక్షల మంది పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వెంకాయమ్మ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలు పూర్తి ఆరోగ్యకరమని నేచురల్ ఫార్మింగ్ అధికారిణి రాధా శింగమనేని అన్నారు. శుక్రవారం మండలంలోని బొద్దులూరివారిపాలెం గ్రామంలో ఏపీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రీమాన్ డ్రై షోయింగ్ విధానంలో విత్తన గుళికలు చేసే విధానాన్ని ఆమె ప్రారంభించారు. తొలకరి జల్లుల కంటే ముందుగా భూమిలో 30 రకాల విభిన్న జాతుల విత్తనాలతో కూడిన గుళికలు తయారుచేసే విధానం గురించి ప్రకృతి వ్యవసాయకులకు ఆమె వివరించారు. ఈ విత్తన గుళికలు వేయడం ద్వారా తేలికపాటి వర్షం పడిన వెంటనే విత్తనాల నుంచి మొక్కలు రావడం, విత్తనాలు దెబ్బతినకపోవడం జరుగుతుందన్నారు. ఈ విధానంలో మరియమ్మ అనే రైతు తనకున్న పంట విస్తీర్ణం మొత్తంలో గుళికలు వేయగా, రాధా శింగమనేని మాట్లాడుతూ ఈ విధంగా వేయడం వలన తక్కువ వర్షపాతంలో కూడా వెంటనే మొలకలు వస్తాయని తెలిపారు. అలా వచ్చిన పంటను రైతులు పశువులు, గొర్రెల మేతగా వాడుకోవచ్చని అన్నారు. 45 రోజులు గడిచిన తర్వాత భూమిని కలియదున్ని పచ్చిరొట్ట ఎరువుగా మార్చి భూమిని సారవంతం చేసుకోవచ్చన్నారు. ఇది రైతులకు అదనపు ఆదాయమని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ పవన్, బాలకృష్ణ, ఐసీఆర్, రైతులు పాల్గొన్నారు.



విత్తన గుళికలు చేసే విధానాన్ని రైతులకు వివరిస్తున్న రాధా శింగమనేని

లోకాయుక్త ఉత్తర్వులు అమలు చేయాలి

దర్శి: దర్శి నగర పంచాయతీ పరిధిలోని గ్రామ సర్వే నంబర్ 247,248,266లో ఎ9.30 సెంట్లు ఎరుకల కులానికి చెందిన పేదలకు లోకా యుక్త కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పట్టాలు మంజూరు చేయాలని ఎరుకల సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఇట్టా శ్రీనివాసరావు, దళిత నేత ప్రేమ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. లోకాయుక్త తమకు తీర్పు ఇస్తే ఇతరులు ఆ భూములు ఆక్రమించుకుని అమ్ముకుంటున్నారని, కోర్టు తీర్పు ప్రకారం తమకు పట్టాలు మంజూరు చేయాలని కొద్ది రోజులుగా ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుడారాలు వేసుకున్నారన్నారు. ఎస్టీలు అక్కడే వండుకుని తింటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎండ పెట్టు తగిలి పేరం అంకమ్మ, ఆవుల తిరుపతమ్మ, కండెల మునెమ్మ, దిగుడు కోటమ్మలు అస్వస్థకు గురి కాగా 108లో దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. 14 సంవత్సరాల క్రితం తీర్పు వచ్చినా ఇప్పటికీ తమకు పొజిషన్ ఇచ్చి పట్టాలు ఇవ్వలేదన్నారు. 2014 జులై 7వ తేదీన జడ్జి మెంట్ వచ్చినా అధికారులు స్పందించిక పోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వంలో నిరాహార దీక్షలు చేసి భూములు కాపాడుకున్నామని చెప్పారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తమకు, జర్నలిస్టులకు కలిపి అక్కడ పట్టాలు మంజూరు చేస్తామని విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చెప్పారన్నారు. పట్టాలు ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని, సోమవారం నుంచి నివాసాల నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. దళిత సేన నియోజకవర్గ అధ్యక్షుడు మార్కు, మాదిగ మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టుపల్లి ప్రసాద్, గుంటూరు ఏసుదాసు, గర్నెపూడి ప్రభాకర్, బండి రామాంజనేయులు, ఏకశిరి ఆంజనేయులు, బాధిత మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత నాయకులు

ఆధునిక వ్యవసాయ పద్ధతులు స్వాగతించాలి



డ్రోన్‌తో పురుగుమందు పిచికారీని పర్యవేక్షిస్తున్న వ్యవసాయాధికారులు

గిద్దలూరు రూరల్: రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ఆధునిక పద్ధతులు స్వాగతించాలని గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని కెఎస్ పల్లె గ్రామ పంచాయతీ పరిధి ఉప్పలపాడులో శుక్రవారం డ్రోన్‌తో పురుగుమందు పిచికారీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. సాగు ఖర్చుతో పాటు సమయాన్ని సైతం తగ్గించుకునే పద్ధతి డ్రోన్ పురుగుమందు పిచికారీ అని రైతులు గుర్తించాలన్నారు. ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

దొనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి సమావేశంలో పాల్గొని అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. వీలైనంత త్వరలో నిర్మాణాలు చేపట్టాలని, అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానిక డంపింగ్ యార్డులో తయారైన వర్మీ కంపోస్ట్ ఎరువు పరిశీలించారు. తీగ జాతి మొక్కలు నాటించారు. పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. స్థానిక జగనన్న కాలనీలు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్, ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్, ఏపీఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, హౌసింగ్ సిబ్బంది, జెస్సీ గ్లోరీ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డీపీఓ నారాయణరెడ్డి

30న కొత్తపాలెం పోలేరమ్మ తిరునాళ్ల

చీరాల టౌన్: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో కొలువైఉన్న కొత్తపాలెం పోలేరమ్మ అమ్మవారి 23వ వార్షిక తిరునాళ్లను ఈనెల 28 నుంచి 30 తేదీ వరకు నిర్వహిస్తున్నామని దేవస్థాన కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 గటంకుండ, మహాలక్ష్మీ అమ్మవారి పూజా కార్యక్రమాలు, 30 తేదీన అమ్మవారికి అభిషేకాలు సాయంత్రం శిడిమాను ఉత్సవం, అనంతరం తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. వార్షిక తిరునాళ్ల సందర్భంగా కోలాటం, మ్యూజికల్ నైట్, విద్యుత్ ప్రభలతో ప్రత్యేక ఆకర్షణను ఏర్పాటు చేశామన్నారు. తిరునాళ్లకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు హాజరవుతున్నారని కమిటీ అధ్యక్షుడు బక్కా శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

బల్లికురవ: మండలంలోని పాతమల్లాయపాలెంలో యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. 52 టీమ్‌లు ఎంట్రీలు సమర్పించగా ఈ నెల 17న ఎస్సై వేమన లాంఛనంగా ప్రారంభించారు. శుక్రవారం జరిగిన మొదటి లీగ్‌లో మల్లాయపాలెం, కొప్పరపాలెం మధ్య జరిగిన పోరులో కొప్పరపాలెం టీమ్ విజేతగా నిలిచారు. సాయంత్రం కొమ్మాలపాడు, మల్లాయపాలెం మధ్య జరిగిన పోరులో మల్లాయపాలెం జట్టు, వలపర్ల, కే రాజుపాలెం మధ్య జరిగిన పోరులో వలపర్ల జట్టు విజేతలుగా నిలిచారు. మరో పది రోజులపాటు పోటీలు జరుగుతాయని నిర్వాహక కమిటీ తెలిపారు. విజేత్సకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, 2వ బహుమతిగా రూ.15 వేలు, 3వ బహుమతిగా రూ. 10 వేలు అందజేయనున్నట్లు కమిటీ తెలిపారు.

మూడు సబ్సిడీ ట్రాక్టర్ల పంపిణీ



యంత్ర పరికరాలు పంపిణీ చేస్తున్న అధికారులు

దొనకొండ: వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా ఈ ఏడాది రైతులకు సబ్సిడీపై మూడు ట్రాక్టర్ల యంత్ర పరికరాలు మంజూరయ్యాయని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. వాటిని శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. చందవరం వైష్ణవి రైతు మిత్ర గ్రూపునకు ఒక ట్రాక్టర్, 9 చెక్కల గొర్రు, ట్రాలీ, గుంటక బ్లేడు అందించారు. వాటి ఖరీదు రూ.10.85 లక్షలు కాగా సబ్సిడీ రూ.3.21 లక్షలు, కొచ్చెర్లకోట వీరాంజనేయ రైతు మిత్ర సంఘానికి ట్రాక్టర్, 9 చెక్కల గొర్రు, 3 తైవాన్ స్ప్రేయర్లు వాటి ఖరీదు రూ.11.16 లక్షలు కాగా సబ్సిడీ రూ.4.06 లక్షలు, శ్రీ వెంకటేశ్వర రైతు మిత్ర సంఘానికి ట్రాక్టర్, రోటావేటర్, గుంటక బ్లేడు, నాగలి ట్రక్కు, వాటి ఖరీదు రూ.13.19 లక్షలు కాగా సబ్సిడీ రూ.4.73 లక్షలు వర్తించిందని వ్యవసాయాధికారి తెలిపారు. ఇంకా కావాల్సిన రైతులకు మండలానికి రూ.12 లక్షలు మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ తెలిపారు.